సాక్షి

# మార్చికల్లా మెట్రో స్వాధీనం

## టేకోవర్ ప్రక్రియను సమీక్షించిన సీఎస్




**సాక్షి, సిటీబ్యూరో:** హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టును ఎల్అండ్టీ నుంచి వచ్చే ఏడాది మార్చి నాటికి స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సూచించారు. టేక్ ఓవర్ ప్రక్రియను వేగవంతం చేసి ఈ ఆర్థిక సంవత్సరాంతానికి పూర్తి చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యదర్శుల స్థాయి కమిటీ, ఎల్ అండ్ టీ అధికారులతో మంగళవారం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి సమావేశంలో ప్రభుత్వం మెట్రో రైల్ను స్వాధీనం చేసుకునే ప్రక్రియపై తాజా పరిస్థితిని సమీక్షించారు. ఇరు పక్షాలు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం బదలాయింపు సజావుగా వేగవంతంగా పూర్తి చేయాలని సూచిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఇదివరకటి ఒప్పందాలకు ఎటువంటి ఆటంకం లేకుండా చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. రాబోయే వంద రోజుల్లో ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. టేక్ ఓవర్ ప్రక్రియ పై ఏర్పాటు చేసిన ట్రాన్సాక్షన్ అడ్వైజర్ ఐడీబీఐ ఈ మేరకు తన నివేదికను త్వరితగతిన పూర్తి చేసి బదలాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు. అనంతరం ఆపరేషనల్, మెయింటెనెన్స్కు సంబంధించిన ప్రతిపాదనలను రూపొందించాల్సిందిగా హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్కు సీఎస్ సూచించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు (అర్బన్ ట్రాన్స్పోర్ట్) ఎన్వీఎస్ రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్రాజ్, ఎల్అండ్టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ ఎండీ కేవీబీ రెడ్డి, ఐడీబీఐ అధికారులు, హెచ్ఎంఆర్ఎల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ డీవీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.